పార్కుల్లో ఆహ్లాదం కరువు!

- నిరుపయోగంగా మారిన వైనం
- రూ.లక్షలు వెచ్చిస్తున్నా ప్రయోజనం సున్నా
- వేసవి నాటికి అందుబాటులోకి తేవాలని డిమాండ్



కేటీరోడ్డులోని చిట్టి గారి పార్కులో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రజలకు ఆహ్లాదం కలిగించాల్సిన పార్కులలో నిర్లక్షపు నీడ అలముకుంది. చిట్టినగర్ పరిధిలోని 46, 47వ డివిజన్లలోని పార్కులు నిరుపయోగంగా మారడంతో ప్రజలకు ఆహ్లాదం కరువైంది. పార్కు అభివృద్ధి కోసం ప్రజాధనాన్ని భారీగా వెచ్చించినా అవి ఉపయోగంలోకి రావడం లేదు. 46వ డివిజన్ కేఎల్‌రావు పార్కు రోడ్డు చివరలో చిల్డ్రన్స్ పార్కును నగర పాలక సంస్థ అభివృద్ధి చేసింది. అయితే పార్కులోకి చిన్నారులను ఎవరినీ అనుమతించకుండా కేఎల్‌రావు పార్కు సిబ్బంది గేట్లకు తాళాలు వేస్తున్నారు. పార్కులో వాకింగ్ చేసేందుకు అవకాశం ఉన్నా సమయానికి తాళాలు తీసే వారు లేక స్థానికులు రోడ్లపైనే వాకింగ్ చేస్తున్నారు. మరో వైపున పార్కులో వలలు ఏర్పాటు చేసి ఇండోర్ క్రికెట్ ఆడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పార్కు కేవలం ఒకరిద్దరి కాకుండా స్థానికులందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పార్కు నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు సరిగా దృష్టి సారించకపోవడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందంటున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ఈ పార్కుపై దృష్టి సారించి స్థానికులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

చిట్టి పార్కుది అదే పరిస్థితి...

47వ డివిజన్ పరిధిలోని కేటీ రోడ్డుపై మరుపిళ్ల చిట్టి ఫ్రీ పార్కు చిట్టినగర్ వాసులకు అందుబాటులో ఉంది. చిట్టి గారి పార్కు అంటే ఎంత పేరో ఫ్రీ పార్కు అంటే అంతే పేరు. అయితే పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఉన్నా, పార్కు నిర్వహణ సరిగా లేకపోవడంతో పార్కు లోపల గడ్డి మొలిచి అపరిశుభ్ర వాతావరణం నెలకుంది. పార్కును శుభ్రం చేసేందుకు కార్పొరేషన్ సిబ్బంది అడపా దడపా వస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పార్కులో ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలు, గడ్డి దర్శనమిస్తుంది. గతంలో పార్కులోకి వృద్ధులు, రిటైర్ అయిన వారు తమ మనవడు, మనవరాలితో కాసింత సేపు సేద తీరేవారు. కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది సైతం పార్కులో పనికి రాని సామగ్రిని భద్రపరుచుకునేందుకు ఉపయోగిస్తున్నారు. పార్కును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి స్థానికులకు ఉపయోగపడేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నాలుగు డివిజన్ల పరిధిలో.....

నాలుగు డివిజన్ల పరిధిలో ఉన్న చిట్టినగర్ ప్రాంతవాసులకు ఆహ్లాదం కరువైంది. చిట్టినగర్ మొదలు కొని పాలప్రాజెక్టు, చిట్టినగర్ నుంచి కొత్తపేట, ఇటు పాత రాజరాజేశ్వరిపేట పరిసరాల్లో ఎక్కడా సరైన పార్కు అందుబాటులో లేదు. నగరానికే తలమానికమైన కేఎల్‌రావు పార్కులో అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక స్థానికులకు అందుబాటులో ఉన్న చిన్న చిన్న పార్కుల్లో సరైన నిర్వహణ లేక స్థానికులు ఆహ్లాదం కోసం వెతుకులాడుతున్నారు. ఆదివారం వచ్చిందంటే చిన్న పిల్లలతో పార్కులకు వెళ్లడం చాలా మంది తల్లిదండ్రులకు అలవాటు. అయితే చిట్టినగర్ పరిధిలోని ప్రజలకు అటువంటి అవకాశం లేకపోవడంతో మేడలపైన, మిద్దెలపైన కాలం వెళ్లదీస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న పార్కులకు చిన్న పాటి మరమ్మతులు నిర్వహిస్తే అవే వారికి ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు వేసవి నాటికి పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన వలలు



బ్యాంక్ కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు

క్లుప్తంగా

108 సిబ్బందికి ప్రశంసాపత్రాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉత్తమ సేవలు అందించిన 108 సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో 108 ఎన్టీఆర్ జిల్లా ఓఈ హష్మీ, భవానీపురం పైలట్ పురుషోత్తమరావు, టెక్నీషియన్ రాజులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు. ఈ ఏడాది 108 అంబులెన్స్‌లో ఉత్తమ సేవలు అందించినందుకు గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందని సిబ్బంది సంతోషాన్ని వ్యక్తం చేశారు.

థామస్ అల్వా ఎడిసన్ సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యుత్ బల్బ్‌ను కనిపెట్టిన శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి అందించిన సేవలు అపూర్వమని కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. వన్‌టౌన్‌లోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనిపెట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక కోమలవిలాస్ సెంటర్‌లో సంఘ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పాజీరావు అసోసియేషన్ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమాజానికి మంచి సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సీనియర్ ఎలక్ట్రీషియన్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గుండు మహేష్, సత్యం, కిశోర్, మాణిక్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

పికెల్‌బాల్ డబుల్స్ విన్నర్ గోపాలరావు, శ్రీకర్



విజయవాడస్పోర్ట్స్: హైదరాబాద్ ఓపెన్ పికెల్ బాల్ ర్యాకింగ్ డబుల్స్ ట్రోఫీని విజయవాడకు చెందిన కర్రి డోలగోపాలరావు, మోతుకూరి శ్రీకర్ సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ కొంపల్లిలోని పికెల్‌బాల్ హబ్‌లో జరిగిన ఈ టోర్నీలో 35 ప్లస్ డబుల్స్ విభాగంలో గోపాలరావు, శ్రీకర్ పాల్గొని అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విన్నర్ టైటిల్ సాధించి విజయవాడ నగర కీర్తిప్రతిష్టలు పెంచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ పికెల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.శ్రీధర్ అభినందించారు.

కలంకారీపై పీహెచ్‌డీ చేసిన లీలావతికి కృష్ణా కలెక్టర్ ప్రశంస



చిలకలపూడి(మచిలీపట్నం): కలంకారీలో పీహెచ్‌డీ చేసిన విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ పామర్తి లీలావతిని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ప్రశంసించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను లీలావతి మర్యాద పూర్వకంగా కలిశారు. కృష్ణాజిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన కలంకారీపై డాక్టరేట్ చేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఐదేళ్ల పాటు కృషి చేసిన ఫలితంగా కలంకారీలో పీహెచ్‌డీ వచ్చిందన్నారు. సొంత జిల్లాలో కలంకారీపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకోవటం హర్షదాయకమన్నారు. ఏపీలో కృష్ణాజిల్లా కలంకారీ పరిశ్రమ దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచిందన్నారు. అటువంటి కలంకారీపై డాక్టరేట్ చేయటం అభినందించదగ్గ విషయమన్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, రిటైర్డ్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ విక్టర్ పాల్ తదితరులు ఉన్నారు.

వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలి



గ్యాస్ డెలివరీ బాయ్స్‌తో ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీహరిబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వంట గ్యాస్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలని, వినియోగదారుని దగ్గర అదనంగా డబ్బు తీసుకోరాదని శ్రీభవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు సూచించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం విద్యాధరపురంలోని భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అయిన శ్రీభవానీ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్స్‌చేత ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గద్దె శ్రీహరిబాబు మాట్లాడుతూ వంట గ్యాస్ సిలెండర్ డెలివరీ చేసేటప్పుడు గ్యాస్ స్టౌవ్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వినియోగదారునికి వివరించాలని చెప్పారు. వినియోగదారులకు సంబంధించి సేఫ్టీ క్లినిక్‌లను త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వినియోగదారుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన గ్యాస్ స్టౌవ్‌లను వినియోగించాలని, అలాగే సురక్షితమైన రబ్బర్ ట్యూబ్‌లను మాత్రమే వాడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీభవానీ గ్యాస్ కంపెనీ మేనేజర్ నీలిమ, డెలివరీ బాయ్‌లు పాల్గొన్నారు.

ఆహ్వాన నాటకోత్సవాలు ప్రారంభం



'గురితప్పిన వేట' నాటకంలోని సన్నివేశం



'మూల్యం'నాటికలోని సన్నివేశం



డాక్టర్ అరుణా సుబ్బారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్రనాటక కళాసమితి ఆధ్వర్యంలో ఏపీ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో మూడురోజులపాటు నిర్వహించనున్న 8వ ఆహ్వాన నాటకోత్సవాలు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలినాటక ప్రదర్శనగా వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించిన 'గురితప్పిన వేట' రెండో ప్రదర్శనగా డాక్టర్ వెంకట్‌గోవాడ దర్శకత్వం వహించిన 'మూల్యం' నాటికను ప్రదర్శించారు. సినీనిర్మాత ఎస్.మల్లికారెడ్డి జ్యోతిని వెలిగించి ఈ నాటకోత్సవాలను ప్రారంభించారు. పారిశ్రామికవేత్త అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ నాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాధరావు మాట్లాడుతూ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఆయారంగాలకు చెందిన వేముల హజరత్తయ్యగుప్తా, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, దొంతాల ప్రకాష్, బొర్రా నరేస్, ఉన్నవ రాధారాణి తదితరులు పాల్గొన్నారు. నాటకోత్సవాలలో భాగంగా జానపదగాయని డాక్టర్ అరుణా సుబ్బారావును ఘనంగా సత్కరించారు.

దుకాణాల వేలంతో రూ.15.92 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద వివిధ దుకాణాలు నిర్వహించుకునేందుకు సోమవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ద్వారా రూ.15,92,300 ఆదాయం వచ్చినట్లు ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. ఏడాది పాటు మొత్తం 19 దుకాణాలు నిర్వహించుకునేందుకు వేలం నిర్వహించామన్నారు. గత ఏడాది దుకాణాల వేలం ద్వారా రూ.9,51,970 ఆదాయం రాగా ఈఏడాది అదనంగా రూ.6,40,330 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన వరదండి దుర్గ భవానీ, కరుణాకర్ భార్యాభర్తలు. వీరికి 14 ఏళ్ల కిందట వివాహం కాగా, ఇద్దరు సంతానం. భార్యాభర్తలిద్దరూ వీఎంసీలో ఉద్యోగాలు చేస్తుంటారు. మద్యానికి బానిసైన కరుణాకర్ కొంత కాలంగా భార్య, పిల్లలను వేధింపులకు గురి చేస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన మండ్లి బయనీకి ఇద్దరు కుమారులు. వారు పోరంకిలోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. ఈ నెల 25వ తేదీన ఎం.బయనీ తన ఇద్దరు కుమారులతో పాటు చెల్లెలి కుమార్తెతో కలిసి పోరంకికి వచ్చాడు. ఇద్దరు కుమారులను పోరంకి బస్‌స్టాండ్ వద్ద ఉండమని చెప్పి చెల్లెలి కుమార్తెను కాలేజీలో దించి రావడానికి వెళ్లాడు. అయితే అతను తిరిగి వచ్చే సరికి రెండవ కుమారుడు బ్రహ్మం పోరంకి బస్‌స్టాండ్ వద్ద కనబడలేదు. పెద్దకుమారుడిని బ్రహ్మం ఎటువెళ్లాడని అడగగా తాను చూడలేదని చెప్పాడు. బయనీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లను తొలగిస్తున్న శానిటేషన్ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావునగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను కార్పొరేషన్ శానిటేషన్ విభాగ సిబ్బంది సోమవారం తొలగించారు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలతో ఇబ్బందులపై సాక్షి ఈ నెల 24వ తేదీన దోమలకు నిలయాలుగా ఖాళీ స్థలాలు శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన కార్పొరేషన్ శానిటేషన్ విభాగం అధికారులు సోమవారం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని శుభ్రం చేయించారు. ఖాళీ స్థలాల యజమానుల వివరాలను రెవెన్యూ అధికారుల ద్వారా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాక్షి కథనంతో ఖాళీ స్థలాలను శుభ్రం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అవగాహనతో గర్భాశయ క్యాన్సర్ దూరం



మాట్లాడుతున్న డాక్టర్ గీతాదేవి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సరైన అవగాహన పెంచుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ని అదుపులో ఉంచడం, కొన్ని సందర్భాల్లో నివారించడం కూడా సాధ్యమవుతుందని ప్రముఖ వైద్యురాలు కె.గీతాదేవి తెలిపారు. ఆయుష్ హాస్పటల్ సహకారంతో కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం సర్వైకల్ అండ్ బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గీతాదేవి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే క్యాన్సర్ కేసుల్లో నాలుగో వంతు కేసులు మన దేశంలోనే నమోదవుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని గమనించి మహిళలు ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బ్రెస్ట్ అండ్ సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం, వ్యాక్సిన్ అందుబాటు, పాటించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను గీతాదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బాధ్యతలు, లక్ష్యాలు అంటూ మహిళలు తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తారని, దీనివల్లే వ్యాధులకు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయని వెల్లడించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి ఉమెన్ స్టడీస్ సెంటర్ సమన్వయకర్తలు కె. స్వాతి, పి.స్వప్న కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్మికులకు అన్యాయం జరిగితే ఉద్యమం



కమిషనర్ ధ్యానచంద్రకు వినతి పత్రం అందిస్తున్న రాజా, చలం తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ నియమించనున్న పోస్టులలో ఇప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న సీనియర్ పారిశుద్ధ్య కార్మికులను తీసుకోవాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షుడు ఎస్వీ చలం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్నేళ్లగా అత్యవసర పరిస్థితుల్లో (కోవిడ్, వరదలు, భవానీ దీక్షలు) దాదాపు 60 మంది పారిశుద్ధ్య కార్మికులతో పని చేయించుకున్నారని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల నియామకంలో రాజకీయాలు చేయడం బాధాకరమని చెప్పారు. నగరపాలక సంస్థ అదనంగా తీసుకుంటున్న పోస్టుల్లో సీనియార్టీ ప్రకారం తీసుకోవాలని, లేని పక్షంలో ఏఐటీయుసీగా ఉద్యమం చేస్తామని తెలిపారు. అవసరమైతే న్యాయపోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. తక్షణం రాజకీయాలు మానుకుని కష్టపడే కార్మికులకు కొత్త పోస్టులలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మినిస్టీరియల్ ఆల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు దారా రాంబాబు, తుపాకుల ప్రతాప్ తదితరులు ఉన్నారు.

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



యోధ కథా సంకలనం పరిచయ సభలో ఇంతియాజ్, గోళ్ళ నారాయణరావు, శాంతిశ్రీ

విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని, అదే కాలానికి నిలుస్తుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎఎండీ ఇంతియాజ్ అన్నారు. సమన్విత సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో సోమవారం యోధ కథా సంకలన పరిచయ సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ కవులు రచయితలు సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. యోధ కథా సంపుటిలోని కథలు వాస్తవ జీవితాలకు అద్దం పట్టాయన్నారు. రచయిత్రి దుట్టా శమంతకమణి సంకలనంలోని రచయిత్రుల కృషిని అభినందించారు. నేటిసమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షత, స్త్రీ కేవలం విలాసవస్తువుకాదన్న సందేశాన్ని ఆయా రచనల్లో వివరించారని పేర్కొన్నారు. సమావేశంలో సాహితీ ప్రముఖులు గోళ్ళ నారాయణరావు, చలపాక ప్రకాష్,అరసవల్లి కృష్ణ, కోపూరి పుష్పాదేవి, అనిల్ డ్యానీ, వడ్లమూడి పద్మ, శాంతిశ్రీ కే ఉషారాణి కథా సంపుటి విశేషాలను వివరించారు. సాహితీ ప్రియులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి వ్యతిరేకం

రామవరప్పాడు: ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక 190/1లో 2.26 ఎకరాల విస్తీర్ణం గల చెరువులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి మెజార్టీ పాలకవర్గ సభ్యులు వ్యతిరేకించారు. సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన సోమవారం పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన అంశాలను పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ పాలకవర్గ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వాల్టా చట్టానికి విరుద్ధంగా చెరువులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాన్ని ఏ విధంగా చేపడతారంటూ పలువురు పాలకవర్గ సభ్యులు అభ్యంతరం వెలుబుచ్చారు. గ్రామం పుట్టినప్పటి నుంచి ఉన్న చెరువును కాపాడుకుంటామని మెజార్టీ సభ్యులు ఈ అంశాన్ని వ్యతిరేకించారు. రామయ్య చెరువు కూడా రానూ రానూ ఆక్రమణలకు గురవుతుందని, పడమర వైపు ప్రహరీ గోడ నిర్మించాలని వార్డు సభ్యుడు మాదు సుబ్బారావు సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనుల అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై ఎడ్యుకేషన్ ఫేర్



ఎడ్యుకేషన్ ఫేర్‌లో పాల్గొన్న పలు దేశాల ప్రతినిధులు

పెనమలూరు: కానూరులో పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, ఐ20 ఫీవర్ సంస్థతో కలిసి సోమవారం విదేశీ విద్యపై ఎడ్యుకేషన్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ మాట్లాడుతూ విద్యార్థులు విదేశీ విద్య అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అమెరికా, యూకే, ఐర్లాండ్ దేశాల్లో ఉన్నత విద్య చదువుకోవడానికి పూర్తి సహకారం, సమాచారం అందిస్తామన్నారు. అంతర్జాతీయ సంబంధాల విభాగాధిపతి డాక్టర్ జగదీష్ వెంగల అంతర్జాతీయ విద్యార్థులకు ఉపాధిపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, ఐ20 ప్రతినిధులు శ్రీనివాసరాజు, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగతో పాట్లు !







కొందరు పర్యావరణ పరిరక్షణపై ఏ మాత్రం అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కనీస బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారు. విజయవాడ సమీపంలోని గొల్లపూడి ముస్తాబాద కెనాల్ వైపు రోడ్డు మార్గంలో గ్రామంలో సేకరించిన చెత్త డంపింగ్‌యార్డును తగలబెట్టారు. దీంతో దట్టంగా వస్తున్న పొగతో సమీపంలో నివసిస్తున్న గృహాల్లోని వాళ్లు నానా అవస్థలు పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పంట పొలాలకు నీళ్లు అందించే కెనాల్ సైతం కలుషితం అయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రోడ్డు భద్రతపై అవగాహన



విజయవాడస్పోర్ట్స్: వాహన చోదకులు హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా వాహనం నడపొద్దని ఏఐఎంఈఈ స్కూల్ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. జిల్లా ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద హెల్మెట్, సీటుబెల్టు ధరించకుండా వాహనాలు నడిపే వారికి సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా వాహనం నడిపి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వాహన చోదకులకు అవగాహన కల్పించిన స్కూల్ విద్యార్థులను ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్, సీఐ రవికుమార్, ఎస్ఐ జి.వి.ఎన్.కుమార్ అభినందించారు.